PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 357 పేజీలు - 08 శుక్రవారం 20 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



డోవల్, గోయల్‌కు అమెరికా

కోర్టు సమన్లు

పన్నూన్ దాఖలు చేసిన పౌర దావాలో కీలక పరిణామం.. ఢిల్లీలోని మూడు జిల్లా కోర్టుల ద్వారా సమన్లు అందజేయాలని న్యూయార్క్ కోర్టు ఆదేశం

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 19: జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్, మాజీ రా చీఫ్ సమంత్ గోయల్‌కు సమన్లు అందజేసేందుకు ఢిల్లీలోని కోర్టుల సహకారం కోరుతూ అమెరికాలోని న్యూయార్క్ దక్షిణ జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ దాఖలు చేసిన పౌర దావాలో

మిగతా2లో...

తెలంగాణకు అన్యాయం చేసింది

బీఆర్ఎస్సే!

- ఏపీతో కుమ్మక్కైంది మీరే.. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసింది మీరే!
- కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించింది కేసీఆర్ కాదా?
- రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సహకరించింది మీరే.. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు
- 2029లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం.. గెలిచిన వారికి మంత్రి పదవి ఇస్తా: సీఎం రేవంత్‌రెడ్డి



తొలి అక్షరం/సిద్దిపేట, నవంబర్ 19: కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని అంగీకరిస్తూ సంతకం చేసింది అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, హరీశ్‌రావు కాదా? ఏపీతో కుమ్మక్కై తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసింది మీరే అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అప్పటి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రగతిభవన్‌కు

మిగతా2లో...



గోపాల్‌పూర్ వైపు

అక్వాన్ తుపాను

- తీవ్ర తుపానుగా బలపడిన వాయుగుండం
- గంటకు 110 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం
- ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు వాతావరణ శాఖ హెచ్చరిక

అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు

చేపట్టొద్దు!

కృష్ణా, గోదావరి జలాలపై కేంద్రం స్పష్టమైన ఆదేశాలు

కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ పరిశీలన తప్పనిసరి

అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తర్వాతే పనులు చేపట్టాలి

2లో

భారత్ పేదరికాన్ని

జయించింది!

- 12 ఏళ్లలో పూర్తిగా మారిన ఆర్థిక వ్యవస్థ
- 13 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు
- ఫిక్కీ వార్షిక సమావేశంలో ప్రధాని మోదీ



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 19: భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే వేగంతో పేదరికాన్ని అధిగమిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫిక్కీ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చాయని పేర్కొన్నారు.గత ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనలో విఫలమయ్యాయని విమర్శించారు. ఒకప్పుడు బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఉండేదని, ప్రస్తుతం దేశ పురోగతికి ప్రపంచమే సాక్షిగా నిలుస్తోందన్నారు. పాత విధానాలు దేశాభివృద్ధిని అడ్డుకున్నాయని పేర్కొన్నారు.ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం

మిగతా2లో...

ఇది ప్రజాపాలన కాదు..

అవినీతి పాలన!

- 20 శాతం కమీషన్ ఇస్తేనే పనులు జరుగుతున్నాయి
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలే ప్రభుత్వ అవినీతికి నిదర్శనం
- రూ.4 వేల పింఛన్ హామీ ఏమైంది?
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 19: రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, అవినీతి పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 20 శాతం కమీషన్ ఇవ్వనిదే పనులు కావడం లేదని, ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే బహిరంగంగా చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలే ప్రభుత్వ అవినీతికి నిదర్శనమని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భూపాలపల్లి ప్రాంతానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పనులు జరగాలంటే పర్సంటేజీలు ఇవ్వాల్సి వస్తోందని చెప్పారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై రూ.5 లక్షల కోట్ల దోపిడీ, టెండర్లలో అవినీతి, కుంభకోణాలకు సంబంధించి ఆరోపణలు వచ్చాయని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని వ్యాఖ్యానించారు.**వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే** అవినీతి సొమ్ముతో ఓటుకు రూ.15 వేలు పంచితే ప్రజలు ఓట్లు వేస్తారనే భ్రమలో ముఖ్యమంత్రి ఉన్నారని కేటీఆర్ విమర్శించారు. ఏడాది తర్వాత రాష్ట్రంలో

మిగతా2లో...

ప్రపంచ శాంతికి అగ్రరాజ్యాలు

ఒక్కటవ్వాలి!

శాంతి, భద్రత పరిరక్షణ మనందరి బాధ్యత

రష్యా, చైనా, అమెరికా కలిసి పనిచేయాలి

అణ్వాయుధాల నిరాయుధీకరణపై చర్చలు

ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం దిశగా అడుగులు: జిన్‌పింగ్, పుతిన్, ట్రంప్



రేవంత్ ప్రసంగంలో ప్రజా సమస్యలేవీ లేవు

- సిద్దిపేటకు నిలిపేసిన రూ.1,070 కోట్ల పనులపై సమాధానం చెప్పాలి.. రైతుల కష్టాలు, సంక్షేమ పథకాలపై సీఎం మౌనం వహించారని హరీశ్‌రావు

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 19: సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంలో ప్రజా సమస్యల ప్రస్తావన లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. గంటకు పైగా సాగిన ప్రసంగంలో రాజకీయ విమర్శలు, వ్యక్తిగత వ్యాఖ్యలే తప్ప కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు భరోసా కల్పించే అంశాలు లేవని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో నిలిచిపోయిన రూ.1,070 కోట్ల అభివృద్ధి పనులపై సీఎం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.ఇందిరమ్మ

మిగతా2లో...

ఎన్నికలను బహిష్కరిస్తే ప్రజాస్వామ్యానికి

ముగింపే!

ఎన్నికల్లో ఓటములైనా ఎదుర్కొంటాం.. పోటీ నుంచి తప్పుకునేది లేదు.. చికాగో యూనివర్సిటీ విద్యార్థులతో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 19: ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయనే కారణంతో ఎన్నికలను బహిష్కరిస్తే ప్రజాస్వామ్యం అంతమైనట్లేనని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రజాస్వామ్యం పవిత్రమైనదని, ఎన్నికల్లో ఓటములు ఎదురైనా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బుధవారం చికాగో

మిగతా2లో...

ప్రపంచ శాంతికి అగ్రరాజ్యాలు ఒక్కటవ్వాలి!

తొలి అక్షరం/షెన్‌జెన్,నవంబర్ 19: ప్రపంచ శాంతి, భద్రతను కాపాడేందుకు కలిసి పనిచేయాల్సిన బాధ్యత ప్రధాన శక్తులైన అమెరికా, చైనా, రష్యాలపై ఉందని ఆ దేశాల అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. గురువారం జరిగిన తొలి త్రైపాక్షిక సమావేశాన్ని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చారిత్రక మైలురాయిగా అభివర్ణించారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో మూడు దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 80 ఏళ్ల క్రితం రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఫాసిస్టు వ్యతిరేక కూటమిలో మూడు దేశాలు కలిసి పోరాడిన విషయాన్ని జిన్‌పింగ్ గుర్తుచేశారు. అప్పటి చారిత్రక అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం కృషి చేయాలని సూచించారు. మానవాళి పురోగతికి పరస్పర సహకారం అవసరమని పేర్కొన్నారు. **వివాదాలకు చర్చలే పరిష్కారం: ట్రంప్** ప్రపంచ సమస్యలపై చర్చల మార్గాలను తెరిచి ఉంచాల్సిన బాధ్యత ప్రధాన దేశాలపై ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. విభేదాలున్న దేశాలు చర్చలకు దూరంగా ఉండటం వల్ల సమస్యలు పరిష్కారం కావని, ప్రత్యక్ష చర్చల ద్వారానే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అణ్వాయుధాల నిరాయుధీకరణపై సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. అణ్వాయుధాలను వదులుకునేలా దేశాలను ఒప్పించడం కష్టమైన ప్రక్రియ అని తెలిపారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం లభించే అవకాశాలున్నాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరు దేశాలు యుద్ధానికి ముగింపు పలకాలని కోరుకుంటున్నాయని అన్నారు. మరింత సురక్షితమైన ప్రపంచ నిర్మాణం కోసం జిన్‌పింగ్, పుతిన్‌లతో కలిసి కొత్త మార్గాలను అన్వేషించడమే తన లక్ష్యమని తెలిపారు. అణ్వాయుధాల వ్యాప్తిని అడ్డుకోవడంలో మూడు దేశాల సహకారం కీలకమని పేర్కొన్నారు. **ఆర్థిక, ఇంధన భద్రతకు సహకారం అవసరం: పుతిన్** ఆర్థిక సంబంధాలు, ఆహార, ఇంధన భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో మూడు దేశాల మధ్య సహకారం అవసరమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ఇతర ప్రాంతీయ వివాదాల పరిష్కారంలోనూ మూడు దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. మాస్కో, బీజింగ్, వాషింగ్టన్ మధ్య పరస్పర గౌరవం, సమతుల్య ప్రయోజనాలతో కూడిన సహకారం ప్రపంచ స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదం, సరిహద్దులు దాటిన వ్యవస్థీకృత నేరాలను ఎదుర్కోవడంలోనూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణకు అన్యాయం చేసింది బీఆర్ఎస్సే!

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించి విందు ఇచ్చి, రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సహకరించింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కమీషన్ల కోసం రాయలసీమ ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి గతమే తప్ప భవిష్యత్తు లేదని స్పష్టం చేశారు.ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించేందుకు సిద్దిపేటకు వచ్చిన సీఎం, ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ పాదయాత్రగా సభాస్థలికి చేరుకున్నారు. రూ.544.11 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు.2014, 2018 ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చారని, 2023లో ఆ పార్టీని ఓడించారని సీఎం అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క స్థానం కూడా రాలేదని, ఆ పార్టీకి రాజకీయ భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. సిద్దిపేటలో నాలుగు దశాబ్దాలుగా కేసీఆర్, హరీశ్‌రావులు అధికారాన్ని అనుభవిస్తున్నారని, ఇకపై కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 2029 ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇప్పిస్తానని ప్రకటించారు.కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిన మదన్‌మోహన్‌ను వెన్నుపోటు పొడిచారని, టీడీపీలో చేరి ఎన్టీఆర్‌తో కలిసి ఆయనపై పోటీ చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో మంత్రి పదవులు అనుభవించి, అనంతరం ఎన్టీఆర్‌కు కూడా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. 2004లో వార్డు సభ్యుడిగా కూడా గెలవని హరీశ్‌రావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సహకారంతో మంత్రి అయ్యారని అన్నారు. అనంతరం సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీని అణచివేశారని ఆరోపించారు.కేసీఆర్, హరీశ్‌రావులు వేల కోట్ల రూపాయలు సంపాదించారని, వారి కుటుంబ సభ్యులకు వేలాది ఎకరాల భూములు ఎలా వచ్చాయని సీఎం ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన కుటుంబాలకు తగిన గుర్తింపు దక్కలేదని విమర్శించారు. 1,200 మంది అమరుల త్యాగాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు పదవులు అనుభవించా రని, అమరుల కుటుంబాలను పట్టించుకోలేదని ఆరోపించారు. శంకరమ్మకు తగిన పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తాను ఈ ప్రాంతానికి ద్రోహం చేస్తానని చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. నాలుగు కోట్ల మంది ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తాను తెలంగాణకు అన్యాయం చేయబోనని స్పష్టం చేశారు. 2015లో కేంద్ర మంత్రి ఉమాభారతి సమక్షంలో కేసీఆర్, హరీశ్‌రావు, చంద్రబాబు నాయుడు కృష్ణా జలాల పంపిణీపై ఒప్పందం చేసుకున్నారని గుర్తుచేశారు. ఆ ఒప్పందం ప్రకారం ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించేందుకు అంగీకరించారని తెలిపారు. 2022లోనూ ఆ ఒప్పందాన్ని కొనసాగించేలా నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. దీనిపై శాసనసభలో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు.గోదావరి జలాలను వినియోగించుకునేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు రూపురేఖలు మార్చి, కాళేశ్వరం ప్రాజెక్టుగా నిర్మించారని సీఎం విమర్శించారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసినా మూడేళ్లకే కూలిపోయిందని ఆరోపించారు. పాలమూరు ప్రాంత ప్రజలు కేసీఆర్‌ను గెలిపించినా ఆ ప్రాంతానికి ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు.సిద్దిపేట వైద్య కళాశాలకు మదన్‌మోహన్ పేరు పెట్టాలని ఆరోగ్య శాఖ మంత్రికి ఆదేశాలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 26న చిలకపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంతో ప్రతి ఇంటికీ భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. కవిత, కేటీఆర్ మధ్య కుటుంబ విభేదాలపై కూడా సీఎం ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. హరీశ్‌రావు బీజేపీ నేతలతో మంతనాలు జరుపుతున్నారంటూ ఆరోపించారు.సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రధానంగా కృష్ణా జలాల పంపిణీ, రాయలసీమ ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టు, బీఆర్ఎస్ పాలనపై సాగింది. బీఆర్ఎస్ నేతల ఆరోపణలకు సమాధానంగా గతంలో జరిగిన ఒప్పందాలను ప్రజల ముందుంచేందుకు సిద్ధమని సీఎం ప్రకటించారు.

ఇది ప్రజాపాలన కాదు.. అవినీతి పాలన!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేది గులాబీ జెండా ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకులు అవినీతి ద్వారా సంపాదించిన సొమ్మును కక్కిస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్ట బోమని హెచ్చరించారు.**పింఛన్లలో 4.70 లక్షల కోత లు** పింఛన్ల సంఖ్యను తగ్గించి, కొత్త పింఛన్లు మం జూరు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసు కుంటోందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో 44.70 లక్షల పింఛన్లు ఉండేవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు విడతల్లో మొత్తం 4.70 లక్షల పింఛన్లకు కోత పెట్టిందని విమర్శించారు. కొత్తగా 4.63 లక్షల పింఛన్లు మంజూరు చేసినట్లు చెబుతున్న ప్రభుత్వం, తొలగించిన వాటితో పోలిస్తే ఏడు వేల పింఛన్లు తక్కువగా ఇచ్చిందని వివరించారు. ఎన్నికల సమయంలో పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి, మూడేళ్లు గడిచినా రూ.2 వేలే ఇస్తున్నా రని ప్రశ్నించారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు

కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ ప్రయో జనాల కోసం ప్రశ్నించకుండా ఢిల్లీ పెద్దలకు అనుకూ లంగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. ఢిల్లీ నాయకులు రాష్ట్రానికి వచ్చినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై విమ ర్శలు చేశారు. ప్రియాంక గాంధీ పర్యటన సమయంలో ముఖ్యమంత్రి వ్యవహరించిన తీరును ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో బైక్‌పై వెళ్తుంటే పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి వెనుక పరుగులు తీశారని వ్యాఖ్యానించారు. బీజేపీ లోనూ ఇదే పరిస్థితి ఉందని, అమిత్‌షా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రాష్ట్ర బీజేపీ నాయకులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ఢిల్లీ పెద్దల కు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి ముప్పు వస్తుందని వ్యాఖ్యానించారు.

పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టండి

- మరో ఘటన జరిగే వరకు వేచి చూడొద్దు.. ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 19: పాఠశాలల్లో విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రానిక్ రంపంతో దాడి జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పిల్లలను పాఠశాలలకు పంపే తల్లిదండ్రుల ఆందోళనను అర్థం చేసుకోవాలని పేర్కొంది. విద్యార్థుల భద్రతకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి



భద్రతా చర్యలపై నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కాకినాడకు చెందిన హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రాప్తాడు ఘటనను ప్రస్తావించిన ధర్మాసనం, మరో ఘటన జరిగే వరకు అధికారులు ఎదురుచూడకూడదని స్పష్టం చేసింది.ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలకు ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నామని విద్యాశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది గుర్రం రామచంద్రరావు ధర్మాసనానికి వివరించారు. ప్రైవేటు పాఠశాలల్లోనూ భద్రతా చర్యలు చేపడుతు న్నారని తెలిపారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రుల పేర్లు ముందుగా నమోదు చేసుకుని, గుర్తింపు కార్డులు చూపించిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్న విధానాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయో లేదో వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

భారత్ పేదరికాన్ని జయించింది!

(మొదటి పేజీ తరువాయి)

గత 13 ఏళ్లలో భారత్‌లో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ తెలిపారు. ఇది తమ ప్రభుత్వ హయాంలో సాధ్యమైందని అన్నారు. వ్యాపారాలను ప్రోత్సహించేందుకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించామని, రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు కల్పించామని వివరించారు.రాబోయే 20 ఏళ్లలో దీర్ఘకాలిక పెట్టుబడులకు ‘ఇండియా ఫస్ట్’ విధానాన్ని పునాదిగా చేసుకోవాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.

గోపాల్‌పూర్ వైపు అక్వాన్ తుపాను

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 19:బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల వైపు దూసుకొస్తోంది. నవంబర్ 20 మధ్యాహ్నం నర్సాపూర్ నుంచి పూరీ మధ్య గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 90100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గాలుల వేగం అప్పుడప్పుడు 110 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించింది.తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.తుపాను ముప్పు నేపథ్యంలో ఒడిశాలో ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సహాయక బృందాలను సిద్ధం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించే జాగ్రత్తలు పాటించాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టొద్దు!

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 19: కృష్ణా, గోదావరి నదులపై కేంద్ర ప్రభుత్వ అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టరాదని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. ప్రాజెక్టుల సమగ్ర నివేదికలను (డీపీఆర్) సంబంధిత నదీ యాజమాన్య బోర్డులకు సమర్పించి, వాటి పరిశీలన అనంతరం అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందాలని సూచించింది.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లోని నిబంధనల ప్రకారం రెండు రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులను చేపట్టే ముందు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) పరిశీలన, సాంకేతిక అనుమతులు పొందాలి. అనంతరం అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి.ఈ మేరకు 2020 అక్టోబర్ 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇరు రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లను బోర్డులకు సమర్పించాలని నిర్ణయించారు. అనుమతులు పొందే వరకు కృష్ణా, గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టుల పనులు చేపట్టవద్దని కేంద్రం స్పష్టం చేసింది.

రేవంత్ ప్రసంగంలో ప్రజా సమస్యలేవీ లేవు

(మొదటి పేజీ తరువాయి)

జీవిత బీమా పథకం అమలు, గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్యలక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంట్, దళితబంధు, రైతుబీమా, గొర్రెలు, చేపల పంపిణీ, కంటి వెలుగు, మన ఊరు–మన బడి వంటి పథకాల పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పథకాలను నిలిపివేశారని లేదా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.సభలో తాడిచెట్టు, గడ్డం గురించి సీఎం చేసిన వ్యాఖ్యలను హరీశ్‌రావు తప్పుబట్టారు. తాడిచెట్టు గౌడన్నల జీవనాధారమని, దానిపై చేసిన వ్యాఖ్యలకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన ప్రాజెక్టులు, వైద్య కళాశాలలకు పేర్లు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఘనత పొందుతోందని విమర్శించారు. సిద్దిపేట అభివృద్ధికి కొత్తగా ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు.

డోవల్, గోయల్‌కు అమెరికా కోర్టు సమన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిణామం చోటుచేసుకుంది.డోవల్‌కు సమన్లు అందజేసేందుకు పటియాలా హౌస్ జిల్లా కోర్టును, గోయల్‌కు అందజేసేందుకు ద్వారక, తీస్ హజారీ జిల్లా కోర్టులను సంప్రదించాలని న్యాయమూర్తి కేథరిన్ పోల్క్ ఫైల్లా ఆదేశించారు. హేగ్ ఒప్పందం ప్రకారం సాధారణ విధానంలో సమన్లు అందజేసే ప్రయత్నం విఫలమవడంతో ప్రత్యామ్నాయ మార్గంలో భారత కోర్టుల ద్వారా అందజేసేందుకు అనుమతించారు.అమెరికాలో తనను హత్య చేసేందుకు కుట్ర జరిగిందంటూ పన్నూన్ 2024లో ఈ దావా వేశారు. ఈ కుట్రలో డోవల్, గోయల్ తదితరులు ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలు నిరూపితమైనవి కావు. భారత్ ఈ దావాను కల్పితమైనది, దురుద్దేశపూరితమైనదిగా పేర్కొంటూ తిరస్కరించింది. న్యాయపరమైన పత్రాలను భారత్‌లో అందజేయాలంటే కేంద్ర న్యాయశాఖ ద్వారానే పంపాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ పౌర దావాలో అమెరికా ప్రభుత్వం భాగస్వామి కాదు.

ఎన్నికలను బహిష్కరిస్తే ప్రజాస్వామ్యానికి ముగింపే!

(మొదటి పేజీ తరువాయి)


యూనివర్సిటీలో విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల వ్యవస్థలో సమస్యలు ఉన్నాయని చెప్పాలంటే వంద, రెండు వందలు, మూడు వందల శాతం ఆధారాలు చూపించాల్సి ఉంటుందని రాహుల్ అన్నారు. ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిస్తే ఆ క్షణమే ప్రజాస్వామ్యానికి ముగింపు పలికినట్లవుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను అంతం చేయడం తమ ఉద్దేశం కాదన్నారు.ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలియజేస్తూ, ఈ క్రమంలో ఎదురయ్యే ఓటములు, ఇబ్బందులను భరించడమే తమ వ్యూహమని చెప్పారు. ప్రొఫెసర్ రాబర్ట్ పాప్ సమన్వయంలో ఈ కార్యక్రమం జరిగింది. రెండు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా రాహుల్ మంగళవారం కొలంబియా యూనివర్సిటీ, బుధవారం చికాగో యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశమయ్యారు.

పదోన్నతుల్లో గ్రూపుల వారీగా అడిక్వసీ లెక్కించకపోతే ప్రయోజనమేమిటి?

- గ్రూపుల వారీగా ప్రాతినిధ్యం లెక్కించకుండా 15 శాతంతో పోల్చడంపై ఆందోళన

- ప్రభుత్వ స్పష్టత ఉన్నా కొన్ని శాఖల్లో అమలు తీరు భిన్నంగా ఉందని ఆరోపణలు

- హెచ్ఓడీల మధ్య సమన్వయ లోపంతో ప్యానళ్ల ఖరారుపై ఉద్యోగుల్లో అయోమయం



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్19: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలులో ప్రభుత్వ ఆదేశాలు ఒకలా ఉంటే, కొన్ని శాఖల్లో అధికారుల తీరు మరోలా ఉందన్న ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. నియామకాలతో పాటు పదోన్నతుల్లోనూ వర్గీకరణకు అనుగుణంగా గ్రూపుల వారీగా ప్రాతినిధ్య సమృద్ధిని (అడిక్వసీ) లెక్కించాల్సి ఉండగా, మొత్తం ఎస్సీ వర్గాన్ని ఒకే యూనిట్‌గా పరిగణిస్తూ ప్రక్రియ కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు దశాబ్దాల పోరాటం ఫలితంగా వచ్చిన చట్టం స్ఫూర్తి పదోన్నతుల వద్ద దెబ్బతింటోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు దశాబ్దాల పోరాటం..వర్గీకరణ చట్టం:

దశాబ్దాలుగా సామాజికంగా,విద్యాపరంగా,ఆర్థికంగా వెనుకబడిన ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు సమానంగా అందాలనే లక్ష్యంతో సాగిన సుదీర్ఘ ఉద్యమాల అనంతరం తెలంగాణ ప్రభుత్వం 2025లో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చింది.తెలంగాణ షెడ్యూల్డ్ కాస్ట్స్ (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) చట్టం, 2025 (యాక్ట్ నంబర్ 15 ఆఫ్ 2025) ద్వారా ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి రిజర్వేషన్ శాతాలను కేటాయించింది.

గ్రూప్-1 (1శాతం): అత్యంత వెనుకబడిన 15 ఉపకులాలు.

గ్రూప్-11 (9శాతం): మధ్యస్థంగా లబ్ధి పొందిన 18 ఉపకులాలు (ప్రధానంగా మాదిగ, అనుబంధ కులాలు).గ్రూప్-111 (5శాతం): మెరుగైన ప్రాతినిధ్యం ఉన్న 26 ఉపకులాలు (ప్రధానంగా మాల, అనుబంధ కులాలు).ప్రతి గ్రూపుకు చట్టబద్ధమైన వాటా అందాలనే ప్రధాన ఉద్దేశంతో రూపొందించిన ఈ విధానం, ఉద్యోగుల పదోన్నతుల్లోనూ పక్కాగా అమలు కావాలని ఉద్యోగులు కోరుతున్నారు.

గ్రూప్‌వైజ్ అడిక్వసీనా..మొత్తం 15 శాతమా?:

పదోన్నతుల విషయంలో ప్రస్తుతం గ్రూప్ వారీగా అడిక్వసీ లెక్కించాలా లేక మొత్తం 15 శాతాన్ని ప్రామాణికంగా తీసుకోవాలా అనే అంశంపై వివాదం నెలకొంది. ఒక కేడర్‌లో 100 పోస్టులు ఉంటే, చట్టం ప్రకారం గ్రూప్-1కు ఒకటి, గ్రూప్-11కు తొమ్మిది, గ్రూప్-111కు ఐదు పోస్టుల ప్రాతినిధ్య లక్ష్యాన్ని విడివిడిగా లెక్కించాల్సి ఉంటుంది.అయితే మొత్తం ఎస్సీ ఉద్యోగులను కలిపి 15 శాతంతో పోల్చి అడిక్వసీ పూర్తయిందని భావిస్తే, ఒక గ్రూపులో ప్రాతినిధ్యం తక్కువగా ఉన్నా మరో గ్రూపులోని ఉద్యోగుల సంఖ్య వల్ల కోటా నిండినట్లు చూపించే అవకాశం ఉందని ఉద్యోగులు అంటున్నారు. దీనివల్ల ఏ గ్రూపులో ఎంత లోటు ఉంది, ఎవరికి అవకాశం దక్కాలి అనే విషయంలో స్పష్టత లోపిస్తోందని పేర్కొంటున్నారు. 2025లో ఆంధ్రప్రదేశ్ రూపొందించిన ఉపవర్గీకరణ నిబంధనల్లోనూ మూడు గ్రూపుల పదోన్నతుల అమలు, అడిక్వసీ అంశాలను ప్రత్యేకంగా పొందుపరిచారని ఉద్యోగ వర్గాలు గుర్తుచేస్తున్నాయి.

స్పష్టత ఉన్నా..శాఖల్లో భిన్న విధానాలు:

గ్రూపుల వారీగా అడిక్వసీ లెక్కించాల్సిన అవసరంపై ప్రభుత్వ స్థాయిలో ఇప్పటికే స్పష్టత ఇచ్చినట్లు అధికారిక పత్రాలు చెబుతున్నాయి. ట్రాన్స్‌కోలో వర్గీకరణ సందేహాలకు సమాధానంగా 6ఆగస్టు 6వ తేదీ,2025న జారీ చేసిన ఇంధన శాఖ లేఖ (లెటర్ నంబర్ 718/హెచ్ఆర్.ఏ1/2025)లో గ్రూప్-1, 11, 111లకు 1శాతం, 9శాతం, 5శాతం ప్రాతినిధ్యాన్ని విడివిడిగా లెక్కించాలని, మొత్తం 15 శాతంగా అడిక్వసీ లెక్కించకూడదని స్పష్టం చేశారు. అలాగే 25-11-2025 మెమో, 26-10-2026న జారీ చేసిన మెమో (నంబర్ 1628/ఎస్సీడీ(పీఓఏ.ఏ2)/2026)లోనూ అన్ని శాఖలు, హెచ్ఓడీలు, సంస్థలు నిబంధనలను ఎలాంటి డీవియేషన్ లేకుండా అమలు చేయాలని ఆదేశించారు. అయినప్పటికీ ఒక్కో శాఖలో ఒక్కో విధంగా అడిక్వసీ లెక్కిస్తున్నారని, దీనివల్ల ఉద్యోగులకు అసమానత ఎదురవుతోందని ఫిర్యాదులు వస్తున్నాయి. పదోన్నతి ప్యానెల్ ఖరారైతే సీనియారిటీ, భవిష్యత్ పదోన్నతులు, ఆర్థిక ప్రయోజనాలపై ప్రభావం పడుతుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగుల ప్రశ్నలు.. డిమాండ్లు:

వర్గీకరణ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత పదోన్నతుల్లో అడిక్వసీని గ్రూపుల వారీగా లెక్కించాలా లేక 15 శాతంగానా అనే దానిపై వెంటనే ఏకరీతి ఉత్తర్వులు ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ సూచనలను ఇతర శాఖలు ఎందుకు పాటించడం లేదో స్పష్టం చేయాలని, తప్పుగా ఖరారైన ప్యానెళ్లను సమీక్షించాలని కోరుతున్నారు. 1.అన్ని శాఖలు, హెచ్ఓడీలకు గ్రూప్‌వైజ్ అడిక్వసీ లెక్కింపుపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి. 2.ప్రతి కేడర్‌లో మంజూరైన పోస్టులు, పనిచేస్తున్న సిబ్బంది, గ్రూపుల వారీగా ప్రాతినిధ్య వివరాలను పారదర్శకంగా వెల్లడించాలి. 3.నిబంధనలు ఉల్లంఘి ంచే అధికారులపై బాధ్యత నిర్ణయించి, సాధారణ పరిపాలనా శాఖ ద్వారా సమన్వయం చేయాలి. చట్టాలు, ఉత్తర్వులు కాగితాలకే పరిమితం కాకుండా, పదోన్నతుల్లోనూ ప్రతి గ్రూపుకు న్యాయమైన వాటా దక్కినప్పుడే వర్గీకరణ లక్ష్యం నెరవేరుతుందని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, అన్ని శాఖలకు ఒకే విధమైన సాఫ్ట్‌వేర్ లేదా ప్రామాణిక ఫార్మాట్‌ను సాధారణ పరిపాలనా శాఖ (జీఏడి) ద్వారా అందిస్తే తప్ప, ఈ వివాదానికి పూర్తిస్థాయి తెరపడదని ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి.

వైద్య సేవల్లోనే కాదు... ఆధ్యాత్మిక సేవల్లోనూ తనదైన ముద్ర!

- శివస్వాములకు 19-11-2026రోజున అన్నదానానికి ముందుకొచ్చిన ప్రశాంతి హాస్పిటల్ అధినేత డా. ఇ. ప్రశాంతి రెడ్డి








తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 19: వైద్య సేవలతో ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ... మరోవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలుస్తూ సేవా మార్గంలో ముందుకు సాగుతున్నారు ప్రశాంతి హాస్పిటల్ అధినేత డా. ఇ. ప్రశాంతి రెడ్డి (ఎం.బి.బి.ఎస్.). వృత్తిపరమైన బాధ్యతలకే పరిమితం కాకుండా, భక్తి కార్యక్రమాల్లోనూ తనవంతు సహకారం అందిస్తూ సమాజం పట్ల తనకున్న సేవా భావాన్ని చాటుకుంటున్నారు. చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో గల నూతన శివాలయం శ్రీ మోక్షలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా పలువురు భక్తులు 41 రోజుల పాటు శివమాల ధరించి భక్తిశ్రద్ధలతో దీక్ష చేపట్టారు. ఈ శివస్వాములకు 19-11-2026 రోజు అన్నదానం నిర్వహించేందుకు డా. ఇ. ప్రశాంతి రెడ్డి స్వచ్ఛందంగా ముందుకు రావడం విశేషం.ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మహోన్నతమైన సేవ అనే భావనతో శివస్వాములకు అన్నదానం చేయడానికి ముందుకు రావడం ఆమె సేవా దృక్పథానికి నిదర్శనం. వైద్య రంగంలో రోగులకు చికిత్స అందిస్తూ ఆరోగ్యాన్ని ప్రసాదించే వైద్యురాలిగా, ఆధ్యాత్మిక రంగంలో భక్తులకు అన్నదానం అందించే సేవామూర్తిగా డా. ప్రశాంతి రెడ్డి రెండు రంగాల్లోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.సేవ చేయడానికి పదవి, హోదా అవసరం లేదని... సేవ చేయాలనే మంచి మనసు ఉంటే చాలని తన కార్యాచరణ ద్వారా నిరూపిస్తున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. **వైద్యమే వృత్తి... సేవే లక్ష్యం... ఆధ్యాత్మికతే మార్గం... అన్నదానమే మహాదానం!** ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్ గురు స్వామి,వీరమల్ల దాసు గౌడ్, కుక్కల నరసింహ,బోయిని నరసింహ యాదవ్,గోగులోతు శంకర్ నాయక్, దోర్నాల గజేందర్, నరసింహ ఎల్ఐసి, ముప్పిడి కృష్ణ కందగట్ల శ్రీను పున్న శివ,భీమనగొని బాల శివ,తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు పజలకు అందుబాటులో లేని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎక్కడ?

- ఎంపీ కనిపించడం లేదంటూ చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్





తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 19: మునుగోడు నియోజకవర్గ ప్రజల ఓట్లతో గెలుపొందిన భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్ విమర్శించారు. ఎంపీ నియోజకవర్గంలో కనిపించడం లేదంటూ చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. మునుగోడు ప్రజల ఓట్లతో ఎంపీగా గెలిచిన చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎన్నికల అనంతరం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. హైదరాబాద్, ఢిల్లీ రాజకీయాలకే పరిమితమవు తూ మునుగోడు ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కష్టాలు, నియోజకవర్గ అభివృద్ధి ఎంపీకి పట్టవా? అని ప్రశ్నించారు.చౌటుప్పల్‌లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభానికి నోచుకోకపోవడం, రాచకొండ సాగునీటి పథకం, శివన్నగూడెం ప్రాజెక్టు, దిండి ఎత్తిపోతల పథకం పనుల్లో జాప్యం, జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగడం వంటి కీలక సమస్యలపై ఎంపీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం రోజుల తరబడి నిలిచిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ ఎందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు.ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత ఉందని, ఎన్నికల సమయంలో కనిపించిన నాయకులు ఎన్నికల తర్వాత కనిపించకుండా పోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఎంపీ వెంటనే మునుగోడు నియోజకవర్గంలో పర్యటించి ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తికి కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి చొరవ చూపాలని సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర యువజన సంఘం నాయకుడు ఉప్పు కృష్ణ, బీఆర్ఎస్ మండల నాయకుడు బాతరాజు యాదగిరి, సుర్వి లింగస్వామి, శేఖర్ గౌడ్, పాలకూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూలగూడలో ఘనంగా అనిరుధ్ తొలి జన్మదిన వేడుకలు

చిన్నారి అనిరుధ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్

సందడిగా వానరసి కుటుంబంలో అనిరుధ్ పుట్టినరోజు వేడుకలు



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 19: నందిగామ మండలం మోత్కూలగూడ గ్రామంలో వానరసి లింగం, శశికళ దంపతుల కుమారుడు అనిరుధ్ మొదటి జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారి పుట్టినరోజును ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ హాజరై చిన్నారి అనిరుధ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. చిన్నారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాల ని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లమ్మ నరసింహులు, కుమార్, శివ, జర్నలిస్టు జగన్ తదితరులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

13వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడిగా చెవగొని వెంకటేష్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక!



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 19: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్ 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చెవగొని వెంకటేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గట్టు శ్రీరామ్ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

17వ వార్డులో ఇంటింటికీ చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 19:చౌటుప్పల్ మున్సిపాలిటీ 17వ వార్డులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సహకారంతో కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, కో-ఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు ఆధ్వర్యంలో నూతన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, 50 ఏళ్లు నిండిన చేనేత, గౌడ కులస్తులకు పెన్షన్లు అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ సహకారంతో 17వ వార్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దగోని రమేష్ గౌడ్, మాదాని గోపాల్, వీరమళ్ల సత్తయ్య గౌడ్, ముత్యాల గణేష్ కుమార్, ఎం.డి. తాజుద్దీన్, ఎస్.కె. యూసుఫ్, ముత్యాల మహాలక్ష్మి, కొండా పారిజాత తదితరులు పాల్గొన్నారు.

18 నెలల కుమారుడి మృతితో మనస్తాపం.. తల్లి ఆత్మహత్య

- చౌటుప్పల్‌లో విషాద ఘటన.. కేసు నమోదు చేసిన పోలీసులు



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 19:కుమారుడి మృతిని తట్టుకోలేక తల్లి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఎల్.కారం గ్రామానికి చెందిన మొదల పావని (22), భర్త రవితో కలిసి జీవనోపాధి కోసం చౌటుప్పల్‌కు వచ్చి హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్నారు.వీరికి 18 నెలల కుమారుడు హేమంత్ ఉన్నాడు. ఆగస్టు 9న ఆడుకుంటూ నాస్టల్ గోలీలు మింగడంతో చికిత్స పొందుతూ 15 రోజుల క్రితం మృతి చెందాడు. కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన పావని, గురువారం ఉదయం 8:30 గంటల సమయంలో భర్త కూరగాయలు తీసుకురావడానికి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి రావుల సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఏఎస్ఐ పి. కరుణాకర్ తెలిపారు.

రాజగోపాల్ రెడ్డిని విమర్శించే ముందు మీ స్థాయి తెలుసుకోండి

పున్న కైలాష్ నేతకు గోషిక వినయ్ కుమార్ ఘాటు హెచ్చరిక!

డీసీసీ అధ్యక్ష పదవి వచ్చినంత మాత్రాన రాజకీయ చరిత్రను మరిచిపోవద్దు.

ఎంతో మంది నాయకులను తయారు చేసిన నాయకుడు రాజగోపాల్ రెడ్డి



తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 19: డీసీసీ అధ్యక్ష పదవి దక్కినంత మాత్రాన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని విమర్శించే స్థాయికి ఎదిగానని అనుకోవద్దని చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ పున్న కైలాష్ నేతపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజగోపాల్ రెడ్డి గురించి మాట్లాడే ముందు మీ రాజకీయ స్థాయి, గత చరిత్ర గుర్తు చేసుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు.రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో రాజకీయంగా ఎదిగిన నాయకులు ఎంతోమంది ఉన్నారని, మీలాంటి నాయకులను తయారు చేసిన ఘనత ఆయనదేనని అన్నారు. పదవులు వచ్చినంత మాత్రాన సీనియర్లను విమర్శించడం, రాజకీయంగా ఎదగడానికి వారిపైనే ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం రాజగోపాల్ రెడ్డిపై వ్యాఖ్యలు చేసేటప్పుడు ఆచితూచి మాట్లాడతారని పేర్కొంటూ, పున్న కైలాష్ నేత తన వ్యాఖ్యల విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఇకనైనా వ్యక్తిగత విమర్శలు మానుకొని హుందాగా వ్యవహరించాలని ఇప్పటికైనా మీరు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని గోషిక వినయ్ కుమార్ డిమాండ్ చేశారు.

ఆపదలో అండగా నిలిచిన లారీ డ్రైవర్స్ అసోసియేషన్.. మానవత్వానికి నిదర్శనం!

- మృతుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేత



తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 19: చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బొంగు రవీందర్ మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన మరణంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. విషయం తెలుసుకున్న ఆరెగూడెం లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. తోటి కార్మికుడి కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో ఆపన్నహస్తం అందించడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. కార్మికుల మధ్య ఐక్యత, పరస్పర సహకారానికి ఈ సహాయం నిదర్శనంగా నిలిచింది. లారీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిసాటి జంగారెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం రమేష్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు బద్దం రాజు, మన్నె వెంకట్ రెడ్డి, ఉయ్యాల లింగస్వామి, మారగోని నరసింహ, మారగోని వెంకటేశం, గంగనబోయిన వెంకటేశం, మేకల వెంకటేశ్వర్లు, మారగోని రమేష్, వెంకటేష్ గౌడ్, బొంగు వెంకటేష్, చిదుగుళ్ల సాయికిరణ్, కొమ్మగోని గణేష్, కొండూరు రమేష్, అనంతుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున పాఠశాలలో పురుషుల దినోత్సవ వేడుకలు

- పురుష ఉపాధ్యాయులు, సిబ్బందికి మహిళా ఉపాధ్యాయినుల సన్మానం



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 19: నాగార్జున పాఠశాలలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న పురుష ఉపాధ్యాయులు, సిబ్బందికి మహిళా ఉపాధ్యాయినులు బహుమతులు అందజేసి సన్మానించారు.పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరి కృషి విలువైనదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు. పరస్పర గౌరవం, సహకారం, ఐక్యతను పెంపొందించడమే ఈ వేడుకల ఉద్దేశమని తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి, అకడమిక్ కోఆర్డినేటర్ మిర్జా అక్రమ్ బేగ్, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు లిబుమోన్, మహిళా ఉపాధ్యాయినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు శ్రీవిద్య ఎంపిక

● తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం.. విద్యార్థినిని అభినందించిన పాఠశాల యాజమాన్యం



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 19: రామన్నపేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని ఏళ్ల శ్రీవిద్య జాతీయస్థాయి స్పీడ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. తెలంగాణ స్పీడ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం చిట్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ అవకాశాన్ని దక్కించుకుంది.డిసెంబర్ 20, 21, 22 తేదీల్లో హిమాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో శ్రీవిద్య తెలంగాణ జట్టు తరఫున పాల్గొననుంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీవిద్యతో పాటు శిక్షణ ఇచ్చిన పీఈటీ కల్పనను కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకడమిక్ డైరెక్టర్ జెవిఎన్ఎస్ మణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇందిరా గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళులు

- జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 19: భారత తొలి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ఆమె విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడియా తిరుమల్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.అలాగే సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, రామాలయ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజెటి బిక్షపతి, పట్టణ అధ్యక్షుడు ఇదునూరి సాయికృష్ణ, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇందిరా గాంధీ సేవలను స్మరించుకున్నారు.

మృతుడి కుటుంబానికి సర్పంచ్ రూ.5 వేల ఆర్థిక సాయం

● భద్రయ్య మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి పరామర్శ



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 19: రామన్నపేట మండలం నీర్నెంల గ్రామానికి చెందిన రాచమల్ల భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం భద్రయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. భద్రయ్య మృతి గ్రామానికి తీరని లోటని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గంగుల వెంకటరెడ్డి, ఆవుల పద్మ నరసింహ, ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్, మాజీ ఉపసర్పంచ్ చల్ల అనిత సత్యప్రకాష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో శాస్త్ర పాఠశాల విద్యార్థినికి బహుమతి



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 19:బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని టి ఆర్ ఎస్ ఎం ఏ,ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో శాస్త్ర హైస్కూల్, ఆర్‌టీసీ కాలనీ, నల్గొండకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మేడి సాక్షి వ్యాసరచన పోటీలో బహుమతి సాధించింది,ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినికి నిర్వాహకులు బహుమతి,ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల కరస్పాండెంట్ కిషోర్ కుమార్, ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థినిని అభినందించి ప్రోత్సహించారు.

నూతన ఎస్సైకి అంబేద్కర్ చిత్రపటం బహూకరణ

- మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్, ఉపసర్పంచ్



తొలిఅక్షరం/నర్సింహులపేట నవంబర్ 19: మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గొల్లమూడి ఉపేందర్‌ను గ్రామ సర్పంచ్ పెద్దమాముల యాకయ్య, ఉపసర్పంచ్ కాస యాకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కేశన్నపల్లెలో ఇందిరమ్మ బీమా ప్రారంభం

తొలిఅక్షరం/ఇల్లంతకుంట, నవంబర్ 19: కేశన్నపల్లె గ్రామంలో ఇందిరమ్మ బీమా పథకాన్ని సర్పంచ్ పోతరాజు చంటి గురువారం ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, ఆశా కార్యకర్త, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

కుంకుడుపాములలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

• చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు..

ఇందిరా బీమా పథకంపై గ్రామస్థులకు అవగాహన



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 19: రామన్నపేట మండలం కుంకుడుపాముల గ్రామంలో భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు నాతి పరశురాములు గౌడ్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పరశురాములు గౌడ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, దేశ ఐక్యత కోసం ఇందిరా గాంధీ ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, ఆమె ఆశయాలను కొనసాగించాలని అన్నారు.అనంతరం ఇందిరా బీమా పథకంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కుటుంబ పెద్ద మరణిస్తే పథకం కింద రూ.5 లక్షల బీమా సాయం అందుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పథకం అమలుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు గ్రామ కాంగ్రెస్ శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో నల్ల శ్రీనివాస్ రెడ్డి, బొక్క జయచేందర్ రెడ్డి, బొక్క వెంకట్ రెడ్డి, గడ్డం అప్పయ్య, గడ్డం మల్లేష్, గొండ్యాల సైదులు, బాసర యాదగిరి, చిల్లర ఉదయ్, నాతి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాచమల్ల భద్రయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన సిపిఎం నాయకులు



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 19:రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం మాజీ జిల్లా నాయకులు రాచమల్ల భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందడం పట్ల సిపిఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భద్రయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ సర్పంచ్ బోయిన ఆనంద్, మాజీ ఎంపీపీ నాగటి ఉపేందర్ మాట్లాడుతూ రాచమల్ల భద్రయ్య మరణం నీర్నేముల గ్రామానికి, నాయి బ్రాహ్మణ సంఘానికి తీరని లోటని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు బండా జగన్మోహన్ రెడ్డి, నేమనంది లింగయ్య, మునుగోటి అత్తయ్య, వార్డు సభ్యులు నాగటి ఉపేందర్, మాజీ వార్డు సభ్యులు నాగటి మహేష్, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, నాగటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ గౌడ్ దశదిన కార్యక్రమంలో నేతల నివాళులు

- నేతి విద్యాసాగర్, దైద రవీందర్ పరామర్శ



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 19: నకిరేకల్ నియోజకవర్గం కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ఉయ్యాల నారాయణ గౌడ్ దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ శాసనమండలి చైర్మన్ నేతి విద్యాసాగర్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ బొల్లా వెంకట్ రెడ్డి పాల్గొని నారాయణ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన కుమారుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉయ్యాల అంజయ్య గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నారాయణ గౌడ్ మృతి కుటుంబానికి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోట పుల్లయ్య, దొడ్డయ్య శ్రీను, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న మారసాల వెంకటేశం



తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్ 19: చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన బొంగు రవి గౌడ్ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ వార్డు సభ్యులు మాలసాల వెంకటేశం మరణించిన బొంగు రవి గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో మునగాల అమరేందర్ రెడ్డి, గంగనబోయిన ఐలయ్య, మారగోని జంగయ్య, బద్దం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నూతన గ్రామ మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి







తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 19: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గొట్లకొండ తండాలో నూతనంగా 10 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ మహిళా సంఘం భవనాన్ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, స్వయం సమృద్ధి సాధించి కుటుంబ అభివృద్ధితో పాటు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. దేశంలో మహిళల అభ్యున్నతికి, పేద ప్రజల సంక్షేమానికి, గిరిజనుల హక్కుల పరిరక్షణకు ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి, వారి హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించాయని తెలిపారు. మహిళా సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి పొదుపు చేసుకోవడం, బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం, చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించడం జరిగింది. త ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని కోరారు.మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, కుటుంబాలు అభివృద్ధి చెందితే గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే అన్నారు. మహిళల సంక్షేమం, గిరిజన గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, పెండం రామన్న, వేముల సాంబయ్య, సాంబిరెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్,కుసుమ చెన్నకేశవులు,బండి శివ, రావుల మహిపాల్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్స్ ఆవుల,శ్రీనివాస్, మాదాటి శ్రీనివాస్, ఎంపీడీఓ లావణ్య, గోట్లకొండ సర్పంచ్ భూక్యా జనార్దన్, భుక్య రమేష్ రాథోడ్, రావుల తిరుపతి రెడ్డి,చల్లా పాపి రెడ్డి, గరికపాటి కృష్ణ రావు, చల్లా కిషన్ రెడ్డి,సింగం అరుణ్,బాల్నే ప్రశాంత్,బాధవత్ సూర్య, దుడిమెట్ల కొమురయ్య పల్లకొండ వెంకట్ దుడిమెట్ల రాజమౌళి వివిధ పంచాయతీ కార్యదర్శి దేవేందర్, మేరుగు విజయ్,తాళ్లపెల్లి భాస్కర్ నేతుల సారంగం, వివిధ గ్రామాల సర్పంచ్ లు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటడం దైవకార్యంతో సమానం

- వెన్నెల పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అవార్డు గ్రహీత,వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య.



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 19: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ గురుకులం(బాలికలు)పాఠశాలలో నెక్కొండ పట్టణ కేంద్రానికి చెందిన కీ.శే ఈదునూరి బిక్షపతి,అమల దంపతుల కుమార్తె ఈదునూరి వెన్నెల పదవ తరగతి అభ్యసిస్తున్న తరుణంలో అట్టి విద్యార్థిని జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకుని,పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.మమత సమక్షంలో రావి మొక్కను నాటారు. ఈసందర్భంగా వనప్రేమికుడు సమ్మయ్య, ప్రధానోపాధ్యాయురాలు మమత మాట్లాడుతూ...మానవ మనుగడకు మొక్కలు కీలకమని,మొక్కలు నాటి సంరక్షించడం ప్రతిఒక్కరి భాద్యతగా తీసుకోవాలని సూచించారు.అనంతరం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకుంటున్న వెన్నెలను ఉద్దేశిస్తూ భారతదేశ తొలి మహిళా ప్రధాని, దివంగత నేత ఇందిరాగాంధీ, ఓరుగల్లు సామ్రాజ్యాన్ని శాసించిన రాణి రుద్రమదేవి ల జన్మదినోత్సవం సందర్భంగా జన్మించిన వెన్నెల సైతం నాటి వీరవనితల పోరాటస్ఫూర్తిని పుణికిపుచ్చుకుని సమాజ సేవలో,జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకొని,'వెన్నెల పేరుకు తగినట్లుగా జీవితంలో సైతం వెలుగులు వికసించే' దిశగా కీర్తి ప్రతిష్టలు సంపాదించి తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామంతో పాటు విద్యను అభ్యసించిన పాఠశాలకు పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గుగులోత్ ధర్మ,దేవర రజిత, సీనియర్ జర్నలిస్ట్ ఈదునూరి మహేష్,వడ్డూరి కుమారస్వామి, పాఠశాల సిబ్బంది రాణి తదితరులు పాల్గొన్నారు.

సుస్మితది ఆత్మహత్య కాదు హత్యే

దోషులను కఠినంగా శిక్షించాలి...

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 19: సుస్మితది ఆత్మహత్య కాదని అది హత్యేనని, దోషులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నడివాడ గ్రామంలో ఇటీవలే ఆత్మహత్య చేసుకున్న కుమారి సుస్మిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్,మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉజ్వలమైన భవిష్యత్ ను వదులుకొని, హృదయాన్ని కదిలించే మరణ వాంగ్మూలం రాసిన తీరు అందరినీ కదిలించింది. ఈ కష్టకాలంలో ఆ భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందించాలని,దీనికి కారకులైన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా అండగా ఉంటామని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వడం జరిగింది.సుస్మిత అనే అమ్మాయిది ఆత్మహత్య కాదు, హత్యేనని గ్రామ బిజెపి సర్పంచ్ కులం పేరుతో వేధించి, అవమానకరంగా మాట్లాడి, అమ్మాయే తప్పు చేసిందని దుర్మార్గంగా మాట్లాడారని,అమ్మాయి సూసైడ్ నోట్ లో చాలా స్పష్టంగా రాసింది.అమ్మాయి మరణానికి కారణమైన సర్పంచ్ ఇతరులు ఎవరిని వదిలిపెట్టద్దు. ఎస్సై కావలసిన అమ్మాయి కుల వివక్ష కు గురై మృతి చెందిందని ఈ విషయాన్ని తెలుసుకోవడంలో ఇంటలిజెన్స్ పోలీసులు విఫలమయ్యారని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఏం చేస్తున్నారో ముందే పసిగట్టి, అక్రమ అరెస్టులు చేసే పోలీసులకు అమ్మాయి పరిస్థితి తెలియకపోవడం విచారకరమన్నారు. మృతి చెందిన తర్వాత పోస్ట్ మార్టం చేయడం కాదు,మరణం సంభవించకుండా పోలీసులు ప్రభుత్వం కాపాడాలి.చనిపోయిన తర్వాత ఎస్పి, కలెక్టర్ ఆర్డిఓ ఎందుకు రాలేదు?కేవలం ఎమ్మార్వో వచ్చి వెళ్లారు. బిజెపి,కాంగ్రెస్ పాలనలో ఎస్సీ ఎస్టీలు క్షేమంగా లేరు,ముఖ్యంగా మహిళలకు రక్షణ కరువైందని విమర్శించారు.సుస్మిత విషయంలో కూడా అమ్మాయికి సాయం చేయాల్సిన బిజెపి సర్పంచ్ కులం పేరుతో, అవమానించాడు.అమ్మాయి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసినట్టుగా, హత్య కోణంలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్వోకు ఫోన్ చేసి వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.స్థానిక డి ఎస్పి కి ఫోన్ చేసి, హత్య కోణంలో విచారణ జరిపి, నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకొని, సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని,వెంటనే చార్జి షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తో ఫోన్ లో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడించారు. నిందితులకు శిక్ష పడేవరకు పార్టీ అండగా ఉంటుందని, ఆర్థిక సాయం కూడా పార్టీ తరపున అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీ చైర్మన్ కుమారి ఆంగోత్ బిందు,మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి,తేళ్ల శ్రీనివాస్,భుక్య సురేందర్,బానోత్ దాము నాయక్, మండల నాయకులు,గ్రామ నాయకులు, ఉన్నారు.

ఇందిరమ్మ పాలన దేశానికి ఆదర్శం

- నర్సింహులపేటలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి.. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



తొలి అక్షరం/నర్సింహులపేట నవంబర్ 19: భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నర్సింహులపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంచినీళ్ల రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, సమగ్రత, సమైక్యత కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆమె తీసుకున్న నిర్ణయాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. ఆమె చూపిన ధైర్యం, నాయకత్వ పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఇందిరమ్మ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇందిరాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు జీనుకల రమేష్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు దసురు నాయక్, సర్పంచ్ పెద్దమాముల యాకయ్య, రాజేందర్,మండల వర్కింగ్ ప్రసిడెంట్ చిర్ర సతీష్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, అలవాల శ్రీనివాస్, మండలం మైనార్టీ అధ్యక్షులు మహబూబ్ ఖాన్, గడ్డి వెంకట్ రెడ్డి, కాస యాకన్న,దొంతు మహేష్,రామకృష్ణ, మున్వర్,నాగమణి,దొంతు రవి, అశోక్ రెడ్డి మధు శ్రీను, అనిల్ వివిధ గ్రామాల వార్డు సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, కార్యకర్తలు, ఇందిరాగాంధీ అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేద ప్రజలకి ఆసరాగా ఆసరా పెన్షన్ పంపిణీ

శ్రీరామగిరి గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్





తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 19: నెల్లికుదురు మండలం,శ్రీరామగిరి గ్రామంలో నేడు నూతనంగా మంజూరైన సామాజిక భద్రతా ఆసరా పెన్షన్ల పత్రాల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భాగంగా నూతనంగా మంజూరైన వితంతు, ఒంటరి మహిళలు మరియు దివ్యాంగులకు గీతకార్మికులకు పెన్షన్ పత్రాలను గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్, లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్ మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్సం రెడ్డి సారథ్యంలో సశీక్షేమ పథకాలు సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వితంతు మహిళలు, ఒంటరి మహిళలు మరియు దివ్యాంగులకు, గౌడన్నలకు పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామంలో అర్హులైన వారు ఎవరైనా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరంగా ఉంటే, వారి వివరాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు.నూతనంగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వ పింఛన్ అందేలా సహకరించిన గ్రామ పంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, రామగిరి సుమన్, సభ్యులు,గొల్లపెల్లి వేణు,బీమలత,పంచాయతీ కార్యదర్శి, మౌనిక,గ్రామ పెద్దలు, గొల్లపల్లి ప్రభాకర్, గుర్రాల నరేష్, పగిడిపెళ్ళి రాములు, గంజి గోవర్ధన్, సోమిరెడ్డి, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాలో టీఎన్జీవోస్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: టీఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని ల ఆదేశాల మేరకు,వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు గాజే వేణుగోపాల్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ,సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు టీఎన్జీవో సభ్యత్వ నమోదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు గాజే వేణుగోపాల్,పాలకుర్తి సదానందం మాట్లాడుతూ టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసశీ జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు అందరూ భాగస్వామ్యం కావాలని,అదేవిధంగా కేవలం టీఎన్జీవోస్ సంఘం ద్వారానే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి సంఘ సభ్యత్వ ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేన్ కీలకపాత్ర పోషిస్తున్నారని వారికి జిల్లా తరుపున కృతజ్ఞతలు తెలుపుతూ,వారికి సంఘ ప్రాథమిక సభ్యులందరూ అండగా నిలవాలని,ఉద్యోగుల సంక్షేమమే సంఘ ప్రధాన లక్ష్యం అని ప్రతి ఉద్యోగికి టీఎన్జీవో సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేసారు.ఈ సందర్భంగా 2026 -2027 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు ప్రతులను ఉద్యోగులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ టిఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు గాజే వేణుగోపాల్,కార్యదర్శి పాలకుర్తి సదానందం,గౌరవ అధ్యక్షులు గజ్జల రాంకిషన్,కేంద్ర సంఘ కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు,జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్,సిటీ అధ్యక్షులు శంకేసి రాజేష్,జిల్లా బాధ్యులు గణేష్,చిరంజీవి, యూసఫ్,వార్డెన్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్,జోసఫ్ రూరల్ అధ్యక్షులు ఆనంద్,కోఆపరేటివ్ ఫోరం జిల్లా అధ్యక్షులు వినోద్,రవీందర్,సతీష్ ముజాహిద్, రాజేంద్రప్రసాద్,అలీ,రాకేష్ విద్యా రాణి,శ్రీదేవి తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు

బ్రాహ్మణవాడలో ఘనంగా ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలు

- ఇందిరమ్మ బీమా పథకంపై అవగాహన కార్యక్రమం



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 7వ డివిజన్,బ్రాహ్మణవాడలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి విచ్చేసి,ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు,డివిజన్ అధ్యక్షులు పోలు లక్ష్మీనారాయణ,గోదాసి శ్రీనివాస్,కానుగంటి స్వరూప,భాగ్యలక్ష్మి,దొమ్మటి రవి కుమార్,శ్రీరాముల రాజు,ఎ.మల్లికార్జున్,ఫయాజ్ తదితరులు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కాలనీలోని దుకాణాల్లో తిరుగుతూ'ఇందిరమ్మ బీమా పథకం'పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...దేశ సమగ్రతకు,పేదల సంక్షేమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ గారని కొనియాడారు.ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ బీమా పథకం' పేద కుటుంబాలకు ఎంతో భరోసా కల్పిస్తుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని,పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

• ఉపాధ్యాయులకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశారాం ఆదేశాలు



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 19: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశారాం ఆదేశించారు. గురువారం జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.202627 విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాల కోసం అన్ని సబ్జెక్టుల్లో ప్రత్యేక పర్యవేక్షణతో స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు అనుమతి లేకుండా విధులకు దూరంగా ఉండరాదని స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ గుడుంబాపై పోలీసుల ఉక్కుపాదం

• ఎస్సై ఉపేందర్ ఆధ్వర్యంలో బోడక తండాలో తనిఖీలు.. 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



తొలి అక్షరం/నర్సింహులపేట నవంబర్ 19: నర్సింహులపేట మండలంలోని బోడక తండాలో అక్రమ గుడుంబా తయారీపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై ఉపేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అదేవిధంగా 10 లీటర్ల నాటుసారా, 10 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ.. అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిని ఉపేక్షించేది లేదని తెలిపారు.

భాజపా ఎండోమెంట్ సెల్ మండల కమిటీలు ఏర్పాటు

- మానుకోట జిల్లాలో అన్ని మండలాలకు నూతన కమిటీలు.. నియామక పత్రాలు అందజేత



తొలిఅక్షరం/నర్సింహులపేట నంబర్ 19: భాజపా ఎండోమెంట్ సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అన్నా వర్ధుల సూర్యప్రకాష్, కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్, జాయింట్ కన్వీనర్ ఈశ్వర ప్రగడ రామారావు ఆధ్వర్యంలో మహబూబాబాద్ (మానుకోట) జిల్లాలోని అన్ని మండలాలకు ఎండోమెంట్ సెల్ కమిటీలను ఏర్పాటు చేశారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి, వారి బాధ్యతలు, విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో భాజపా మానుకోట జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి నంద్యాల అశోక్, భాజపా ఎండోమెంట్ సెల్ జిల్లా కన్వీనర్ నాగయ్య శాస్త్రి, కో-కన్వీనర్ అలువాల శ్రీధర్, జాయింట్ కన్వీనర్ గర్రెపల్లి నాగేష్, మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్‌తో పాటు భాజపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు పింఛన్ భరోసా

- గుబ్బగుర్తిలో నూతన చేయూత పింఛన్ కార్డుల పంపిణీ



తొలి అక్షరం/నవంబర్ 19, కొనిజర్ల: ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనందించింది. ఒంటరి మహిళలు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, దివ్యాంగులకు నూతన పింఛన్లు మంజూరు చేయగా, గుబ్బగుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పింఛన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంతాల ప్రశాంతి నరసింహారావు, ఉపసర్పంచ్ గోళ్ల యుగేందర్, గోపవరం సొసైటీ డైరెక్టర్ మీర్జా ఖాసిం బేగ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి శావణబోయిన నరేష్, కాంగ్రెస్ నాయకులు అడపా రామారావు, నున్నా వీరభద్రరావు, తాటి శ్రీనివాసరావు, గోరపూడి ఏసు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ల రద్దు కనీస వేతనం పెన్షన్ పెంపుకై డిసెంబరు 1న చలో పార్లమెంటును జయప్రదం చేయండి: బొట్ల చక్రపాణి పిలుపు



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు కనీస వేతనం 42,000 నిర్ణయించి అమలు చేయాలని పెన్షన్ 21,000 నిర్ణయించి అమలు చేయాలని తదితర డిమాండ్ సాధన కోసం డిసెంబర్ 1 2 3 తేదీలలో ఆకుపై ఢిల్లీ చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు అనుమకొండ జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి కార్మికులకు పిలుపునిచ్చారు.హమాలి కార్మికులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ...కార్మికుల శ్రమతో సృష్టించిన సంపదను పోగేసుకొని యజమానులు కుబేర్లు అవుతున్నారని పాలకవర్గాలకు కార్మికుల సంక్షేమం ఏ మాత్రం పట్టడం లేదని ఆయన ఆవేదన చేశారు.మోడీ ప్రభుత్వం 29 రకాల కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను అమలులోకి తెచ్చి కనీస వేతనాన్ని దిగజార్చింది,8గంటల పని విధానానికి మంగళం పాడింది,ఉద్యోగ భద్రత కాలరాల్సింది,సమ్మె చేయకుండా ఆటంకాలు విధిస్తుంది,కోట్లాది మంది కార్మికులను కార్మిక చట్టాల పరిధిలోకి రాకుండా వెలపలికి నెట్టివేసిందని ఆయన అన్నారు.ఇలాంటి ప్రమాదకరమైనది కోడ్లను రద్దుచేసి కనీస వేతనం 42 వేల రూపాయలు పెన్షన్ 21 వేలు ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి వ్యతిరేకంగా తదితర డిమాండ్ల సాధన కోసం జరిగే చలో పార్లమెంట్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనే జయప్రదం చేయాలని చక్రపాణి పిలుపు నిచ్చారు. ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బొచ్చు ఆదాం నాయకులు రాజు, రాజమౌళి అశోక్ ఉపేందర్ రమేష్ కుమార్ స్వామి సామేలు చరణ్ మోహన్ కమల్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం : బైరు అశోక్ గౌడ్

ఇనుగుర్తిలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

త్యాగం, సేవ, సంకల్పానికి ప్రతిరూపం ఇందిరాగాంధీ : బైరు అశోక్ గౌడ్

తొలి అక్షరం/ఇనుగుర్తి: సెప్టెంబర్ 19: ఇనుగుర్తి మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఉక్కు మహిళ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్ పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఇనుగుర్తి మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా జయంతి వేడుకలు



నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకురాలు ఇందిరాగాంధీ అని, పేదల సంక్షేమం, దేశాభివృద్ధి, మహిళా సాధికారత కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఆమె ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కట్టుబడి ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టౌన్ సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు తమ్మడపల్లి కుమార్, మాజీ మండల అధ్యక్షుడు కూరెళ్లి సతీష్, టౌన్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గంజి రవీందర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మామిడి జనార్ధన్, మిట్యా తండా సర్పంచ్ చిన్ని వెంకన్న, లాల్ తండా సర్పంచ్ భూక్య వెంకన్న, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల మల్లేశం, ఏఎంసీ డైరెక్టర్ రాము, కొంతం ప్రభాకర్, వార్డు సభ్యులు నద్దునూరి ప్రశాంత్, నాగెళ్లి సుధీర్, చీకటి అశోక్, సలీం తదితరులు పాల్గొన్నారు.

లీసర్వే పనులు పారదర్శకంగా చేపట్టాలి

● సర్వే బృందాలకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆదేశాలు



తొలి అక్షరం/పెనుబల్లి, నవంబర్ 19: మండలంలోని తాళ్లపెంట గ్రామంలో భూ రీసర్వే పనులను పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో రైతులు, సర్వే బృందాలతో మాట్లాడి పనుల పురోగతిని సమీక్షించారు.తాళ్లపెంట గ్రామంలో మొత్తం 8,462.02 ఎకరాల భూమి ఉండగా, అందులో 4,465 ఎకరాలు అటవీ భూమిగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు 517 ఎకరాల 17 కుంటలకు సంబంధించి ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయిందని, మూడు ప్రత్యేక బృందాలతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.భూముల విస్తీర్ణం, సరిహద్దులు, హక్కులు, అనుభవదారుల వివరాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలను నివారించవచ్చని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు సర్వే బృందాలకు సహకరించాలని, తమ భూముల వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ప్రతి రైతుకు సరైన భూ వివరాలు అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు.

చదరంగ పోటీల్లో చిన్నారుల మేధో ప్రతిభ

షాద్‌నగర్ గ్రంథాలయంలో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చదరంగ పోటీలు.. ప్రారంభించిన మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం







తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 19: పుస్తక పఠనంతో విజ్ఞానం, చదరంగంతో మేధో వికాసం సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో గురువారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, బాలబాలికల చదరంగ పోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చదరంగ పోటీలను మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం ప్రారంభించారు. అనంతరం భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చిన్నారుల్లో చదరంగ క్రీడపై ఆసక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 80 మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. బాలుర విభాగంలో రేయాన్ష్, రామ్ అక్షిత్, వేదాదిత్య, కార్తీక్ టాప్-4 స్థానాల్లో నిలవగా, బాలికల విభాగంలో సాన్విత, భవాని, అనీక్ష, నాగశ్రీనిధి టాప్-4 స్థానాలను సాధించారు. చదరంగ మాస్టర్ వానరసి జగన్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ చదరంగం విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, తార్కిక ఆలోచన, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించే గొప్ప క్రీడ అని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల ద్వారా పుస్తక పఠనంపై ఆసక్తితోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులకు చాక్లెట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్‌మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్లు నక్క బాల్‌రాజ్ యాదవ్, సి. వీరేష్, ప్రధాన కార్యదర్శి క్యూ సెట్ శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్, కోశాధికారి నీళ్ల రవీందర్ గౌడ్, సంయుక్త కోశాధికారి కత్తి చంద్రశేఖర్ అప్ప, డైరెక్టర్లు రవి నాయక్, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గళం.. తండాలలో నిద్ర

● కాంగ్రెస్ గిరిజన డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయి? ● తండాల్లో పర్యటించి గిరిజన బతుకులపై సేవాలాల్ సేన క్షేత్రస్థాయి అధ్యయనం ● సర్పంచులకు బిల్లుల కష్టాలు.. ఉద్యోగులకు కుల వివక్ష.. విద్య, వైద్యం, భూమి, ఉపాధిపై ప్రభుత్వానికి 15 డిమాండ్లు ● ఎస్టీ కమిషన్ ఏర్పాటుపై ప్రభుత్వానికి ధన్యవాదాలు.. ● చేవెళ్ల డిక్లరేషన్, సేవాలాల్ జయంతి నిధులు అమలు చేయాలని డిమాండ్



తొలి అక్షరం/ఏన్కూర్ నవంబర్ 19: ఎన్నికల సమయంలో గిరిజనుల అభివృద్ధి పేరుతో ఇచ్చిన హామీలు ఆచరణలో మాత్రం కనిపించడం లేదని సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ హుస్సేన్ నాయక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజనుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు అక్టోబర్ 28 నుంచి చేపట్టిన 'గిరిజన గళం తండాలో నిద్ర' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తండాలను సందర్శించి ప్రజల సమస్యలను అధ్యయనం చేసినట్లు వెల్లడించారు. తండాల్లోనే రాత్రి బస చేస్తూ గిరిజన కుటుంబాల జీవన పరిస్థితులు, విద్య, వైద్యం, వ్యవసాయం, భూమి హక్కులు, ఉపాధి, మహిళల సమస్యలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నామని తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మొదటి విడత పర్యటన నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇది కేవలం యాత్ర కాదని, తండాల్లోని వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి తెలియజేసే ప్రజా చైతన్య కార్యక్రమమని స్పష్టం చేశారు. **డిక్లరేషన్ హామీల అమలేది?** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన గిరిజన డిక్లరేషన్‌లోని పది ప్రధాన హామీలను తక్షణమే అమలు చేయాలని హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశారు. ప్రతి ఎస్టీ కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం, ఇంటి స్థలం లేని వారికి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 6 లక్షలు, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకాలు, ప్రతి గ్రామపంచాయతీకి ఏటా రూ. 25 లక్షల అభివృద్ధి నిధులు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, గిరిజన రైతులకు భూమి హక్కులు, ప్రతి మండలంలో గురుకులాలు, మైదాన ప్రాంత గిరిజనులకు ప్రత్యేక అభివృద్ధి సంస్థలు, సేవాలాల్, ఆదివాసీ, ఎరుకల కార్పొరేషన్ల ఏర్పాటు వంటి హామీలను కార్యాచరణతో అమలు చేయాలని కోరారు. **సర్పంచులకు బిల్లుల కష్టాలు.. ఉద్యోగులకు వివక్ష** గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం సొంత డబ్బులు, అప్పులు పెట్టి పనులు పూర్తి చేసిన గిరిజన సర్పంచులకు నెలల తరబడి బిల్లులు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆస్తులు తాకట్టు పెట్టుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేసి, భవిష్యత్తులో ముందస్తు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.మరోవైపు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులు కుల వివక్ష, అధికారుల ఒత్తిళ్లు, వేధింపులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. వీటిపై ప్రత్యేక విచారణ వ్యవస్థ ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.



విద్య, వైద్యం.. తండాలకు అందని సేవలు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో కనీస వసతుల కొరత, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, మందులు, తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. సాధారణ అనారోగ్యానికి సైతం పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, పేద గిరిజన కుటుంబాలు వైద్య ఖర్చుల కోసం అప్పులు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి మండలంలో నాణ్యమైన గిరిజన విద్యాసంస్థలు, మెరుగైన ప్రభుత్వ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. **భూములు, ఉపాధి, వ్యవసాయంపై ఆందోళన** గిరిజనుల భూముల ఆక్రమణలు, పోడు భూముల పట్టాల సమస్యలు, సాగునీటి కొరత, నకిలీ విత్తనాలు, అధిక పెట్టుబడి ఖర్చులు, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి సమస్యలు రైతులను వేధిస్తున్నాయని తెలిపారు. పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో స్థానిక గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించేలా పర్యవేక్షించాలని కోరారు. తండాల్లో బెల్ట్ షాపుల నియంత్రణ, మహిళలకు స్వయం ఉపాధి రుణాలు, ముంపు బాధితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.**ప్రభుత్వం ముందు 15 ప్రధాన డిమాండ్లు** సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ తరపున ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్లు, అర్హత కలిగిన తండాలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తింపు, మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ ప్రాతినిధ్యం, ఏజెన్సీ హక్కులకు చట్టబద్ధత, సేవాలాల్ మహారాజ్ మందిరం, గోర్ ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు, గోర్ బోలి భాషకు ఎనిమిదో షెడ్యూల్ గుర్తింపు, గిరిజన పూజారులకు గౌరవ వేతనం, హాథీరాం బావాజీ మఠం ఆస్తుల పరిరక్షణ, లంబాడీ సమాజానికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం, సేవాలాల్ జయంతికి అధికారిక సెలవు, తీజ్ పండుగకు గుర్తింపు, పరిశ్రమల్లో స్థానిక గిరిజనులకు ఉద్యోగాలు, పెండింగ్ ట్రైకార్ సబ్సిడీల విడుదల, సర్పంచుల బిల్లుల చెల్లింపు, గిరిజన ఉద్యోగులపై వివక్షకు అడ్డుకట్ట వంటి అంశాలను 15 డిమాండ్ల రూపంలో ప్రభుత్వం ముందుంచినట్లు తెలిపారు.ం **ఎస్టీ కమిషన్ ఏర్పాటుపై ధన్యవాదాలు** గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ తరపున స్వాగతిస్తున్నామని హుస్సేన్ నాయక్ తెలిపారు. అదే విధంగా చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని, సేవాలాల్ మహారాజ్ జయంతి నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు.**పోరాటాలే మా బలం..** **హామీల అమలే మా లక్ష్యం** తండాలను గ్రామపంచాయతీలుగా సాధించుకునే ఉద్యమం, ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచే పోరాటం, సేవాలాల్ మహారాజ్ జయంతికి గుర్తింపు, పోడు భూముల సమస్యలపై పాదయాత్రలు, సాదాబైనామా సమస్యలపై దీక్షలు, గిరిజన నిరుద్యోగుల ఉద్యోగాల కోసం ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సేవాలాల్ సేనకు ఉందని ఆయన గుర్తుచేశారు.తండాలో నిద్రించి గిరిజనుల కష్టాలను తెలుసుకోవడం మా బాధ్యత. ఆ సమస్యలకు పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యత. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితం కాకుండా బడ్జెట్ కేటాయింపులతో, స్పష్టమైన కాలపరిమితితో అమలు చేయాలి. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి సాధించే వరకు సేవాలాల్ సేన పోరాటం కొనసాగిస్తుందని బానోత్ హుస్సేన్ నాయక్ స్పష్టం చేశారు.



కృతి, కీర్తిలతో కలిసి రజినీకాంత్‌గా మారిన అనిల్ రావిపూడి..!

ప్రమోషన్స్ అంతే చాలు అనిల్ రావిపూడి ముందుంటారు. సంక్రాంతి సినిమాల సందడి మొదలవ్వడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ దర్శకుడు అనిల్ రావిపూడి మాత్రం అప్పుడే ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టేశారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా ఆయన తెరకెక్కిస్తున్న మల్టీస్టారర్ మూవీ 'జనవరి 12 విడుదల'. ఈ సినిమా 2027 సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సినిమా విడుదలకు ముందే అనిల్ రావిపూడి తనదైన స్టైల్‌లో ప్రమోషన్స్‌తో సందడి చేస్తున్నారు. ూశ్రీంశీ =ష్మఎ - ట్రెండీ టాక్: జాతీయ ఉత్తమ నటి ప్రయోగాలు ఈ సినిమా ప్రమోషన్స్‌లో



భాగంగా అనిల్ రావిపూడి చేసిన ఓ పని ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన క్లాసిక్ మూవీ దళపతిలోని ఓ పాపులర్ సీన్‌ను ఆయన రీక్రియేట్ చేశారు. ఇందులో హీరోయిన్ కృతి శెట్టి కూడా పాల్గొన్నారు. ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇవ్వడానికి ఈ సరదా వీడియోను రూపొందించారు. ఈ వీడియోలో అనిల్ రావిపూడి, కృతి శెట్టి చేసిన సందడి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే ఈ ప్రమోషనల్ వీడియోలో మరో ఆసక్తికరమైన విషయం కూడా ఉంది. సినిమా హీరోయిన్లు కీర్తి సురేష్, కృతి శెట్టి ఇద్దరూ కలిసి కనిపిస్తూ సరదాగా మాట్లాడుకున్నారు. ప్రమోషన్స్ అంటే అనిల్ రావిపూడి ప్రతిచోటా వచ్చేస్తున్నారనే అర్థం వచ్చేలా ఫన్నీగా కామెంట్స్ చేశారు. అంతేకాదు, ఇది తమ గర్ల్స్ సాంగ్ అంటూ చిన్న స్టెప్‌తో సందడి చేశారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు కూడా తమదైన శైలిలో స్పందిస్తున్నారు. అనిల్ రావిపూడి సినిమా ప్రమోషన్స్‌లో కూడా కామెడీని వదలడం లేదని కామెంట్స్ చేస్తున్నారు. సినిమా విడుదలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పుడే ఈ స్థాయిలో సందడి చేస్తుంటే, రిలీజ్ సమయానికి ఇంకెన్ని కార్యక్రమాలు ప్లాన్ చేస్తారో అని ఆసక్తి చూపిస్తున్నారు. నవంబర్ 20 నుంచి ఈ సినిమా పాటల ప్రమోషన్స్ ప్రారంభం కానున్నాయి. జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మరోవైపు డిసెంబర్ 26, 27 తేదీల్లో చికాగోలో, డిసెంబర్ 29 నుంచి 31 వరకు ఆస్టిన్, డల్లాస్ నగరాల్లో చిత్ర బృందం అమెరికా ప్రమోషనల్ టూర్ నిర్వహించనుంది.

పురుషుల దినోత్సవం సందర్భంగా రామ్ లోన్ వోల్ఫ్

(నవంబరు 19) అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని పురుషులందరికీ సెల్యూట్ చేస్తూ శుభాకాంక్షలు తెలిపాడు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఒ=ూశీ23 చిత్రం నుంచి ఒక అదిరిపోయే ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేశాడు. ఈ సినిమాలో తాను పోషిస్తున్న 'లోన్ వోల్ఫ్' పాత్ర వెనుక భాగాన్ని ఆవిష్కరిస్తూ రిలీజ్ చేసిన ఈ పోస్టర్ సినీ ప్రియులను అమితంగా ఆకట్టుకుంటోంది. తన 'ఎక్స్' ఖాతా ద్వారా ఈ పోస్టర్‌ను పంచుకున్న రామ్.. "లోన్ వోల్ఫ్: తన సొంత మార్గాన్ని ఎంచుకుని, ప్రపంచాన్ని ఒంటరిగానే ఢీకొట్టే అత్యంత స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తి" అంటూ ఆ పాత్ర తాలూకు స్వభావాన్ని నిర్వచించాడు. అంతర్గత బలం, మొక్కవోని దృఢ సంకల్పం కలిగిన ఒక బలమైన వ్యక్తిత్వంతో ఈ నియో-నాయర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాతో రామ్ తన కెరీర్‌లో సరికొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టాడు. నటుడిగానే కాకుండా మొదటిసారిగా రచయితగా, దర్శకుడిగా మెగాఫోన్ పట్టి సరికొత్త బాధ్యతను తన భుజాన వేసుకున్నాడు.ఈ చిత్రంలో రామ్‌తో పాటు బాలీవుడ్ ప్రముఖ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్, సంయుక్తా మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక సాంకేతిక బృందం విషయానికి వస్తే.. ప్రతిభావంతుడైన ఎస్.తిరునావుక్కరసు డీవోపీగా పనిచేస్తుండగా, సౌత్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్ సంగీతం సమకూరుస్తున్నాడు. 'రాపో' సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విస్తృతమైన కథాంశం, అద్భుతమైన నటీనటుల కలయికతో తెలుగు ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని పంచేందుకు రామ్ సిద్ధమవుతున్నాడు.



ఆ వార్తల్లో నిజం లేదు

తమిళ స్టార్ సూర్య సినిమాలో గోపీచంద్ విలన్ అంటూ ప్రచారం ఖండించిన గోపీచంద్ టీం



టాలీవుడ్ హీరో గోపీచంద్ ఒక తమిళ సినిమాలో ప్రతినాయకుడి పాత్ర (విలన్) పోషించనున్నాడంటూ వస్తున్న వార్తలను ఆయన బృందం ఖండించింది. ఇవి పూర్తిగా అవాస్తవాలని స్పష్టం చేస్తూ బుధవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళ స్టార్ హీరో సూర్య తదుపరి చిత్రంలో గోపీచంద్ విలన్‌గా నటించబోతున్నాడని, ఈ పాత్ర కోసం భారీ పారితోషికం కూడా ఆఫర్ చేశారని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో గోపీచంద్ టీం స్పందిస్తూ "మా హీరో గోపీచంద్ ఓ తమిళ చిత్రంలో విలన్‌గా నటిస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం. మీడియా, సోషల్ మీడియా హ్యాండిల్స్ ఇలాంటి తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని కోరుతున్నాము" అని ఆ ప్రకటనలో పేర్కొంది. గోపీచంద్ ప్రాజెక్టులకు సంబంధించిన ఏ అధికారిక సమాచారాన్నైనా తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారానే తెలియజేస్తామని తెలిపింది.గోపీచంద్ తన కెరీర్ ఆరంభంలో 'జయం', 'నిజం', 'వర్షం' వంటి విజయవంతమైన చిత్రాల్లో ప్రతినాయకుడిగా నటించి గొప్ప పేరు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత హీరోగా స్థిరపడి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందాడు. ప్రస్తుతం ఆయన సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో 'భారత వర్ష: సాగా ఆఫ్ శులా' అనే చారిత్రక యాక్షన్ చిత్రంతో పాటు, 'సింగ' అనే మరో యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తూ బిజీగా ఉన్నాడు.

కష్టాలు తట్టుకుని నిలబడిన నిజమైన హీరో కాంతారావు: తమ్మారెడ్డి



తెలుగు తెరపై జానపద కథానాయకుడిగా కాంతారావు ఒక వెలుగు వెలిగారు. ఎన్టీఆర్ .. ఏఎన్నార్ తరువాత స్థానంలో తన ప్రత్యేకతను చాటుకున్న కాంతారావు, సాంఘిక .. పౌరాణిక చిత్రాలలోను ప్రేక్షకులను మెప్పించారు. నిర్మాతగా నష్టపోయిన ఆయన, తన చివరి రోజులలో ఆర్థికపరమైన ఇబ్బందులను చూశారు. ఆ సమయంలో టీవీ సీరియల్స్ చేస్తూ, ముందుకు వెళ్లారు. అలాంటి కాంతారావును గురించి 'ఐ డ్రీమ్' వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తమ్మారెడ్డి భరద్వాజ ప్రస్తావించారు. కాంతారావుగారు కథానాయకుడిగా ఒక ప్రత్యేకమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఎన్టీఆర్ .. ఏఎన్నార్ తరువాత తన పేరు చెప్పుకునే స్థాయికి ఆయన ఎదిగారు. ఎన్టీఆర్ - ఏఎన్నార్ ఇద్దరితోను సఖ్యతగా ఉంటూ, వాళ్లిద్దరి సినిమాలలోనూ నటించారు. ఎన్నో భారీ విజయాలను అందుకున్నారు. నిర్మాతగా కొన్ని సినిమాలు ఆయనకి నష్టాలు తెచ్చిపెట్టాయి. అందువలన ఆయన చాలా ఇబ్బందులు పడ్డారు పాపం. ఒక స్థాయిలో డబ్బును .. హోదాను చూసిన కాంతారావు, ఆ తరువాత ఆర్థికపరమైన ఇబ్బందులను తట్టుకుని నిలబడటం అంత తేలికైన విషయం కాదు" అని అన్నారు."కాంతారావుగారు సినిమాలను నిర్మించడం వలన నష్టాలు చూడవలసి వచ్చింది. సాధారణంగా అలాంటి పరిస్థితులలో ఇండస్ట్రీలో గౌరవం తగ్గుతూ ఉంటుంది. అలాంటి సన్నివేశాలను ఫేస్ చేయడం ఒక స్థాయి వ్యక్తులకు అంత తేలికైన విషయం కాదు. అలాంటి పరిస్థితులను అధిగమిస్తూ .. తాను ముందుకు వెళుతూ .. కుటుంబాన్ని నెట్టుకురావడం నిజంగా చాలా గొప్ప విషయమేనని చెప్పాలి. తెరపైనే కాదు .. జీవితంలో చివరి నిమిషం వరకూ ఆయన పోరాడుతూనే వచ్చారు. అందువలన కాంతారావుగారు చాలా ధైర్యవంతుడు అనే అంటాను" అని తన మనసులోని మాటను చెప్పారు.

మెడిసిన్ ఇంటర్న్‌షిప్ కోసమే

తెలుగు సినిమాలకు దూరం కావడంపై క్లారిటీ ఇచ్చిన నటి శ్రీలీల



గత కొంతకాలంగా తెలుగు సినిమాల్లో పెద్దగా కనిపించకపోవడంపై వస్తున్న ప్రచారానికి నటి శ్రీలీల తెరదించింది. తాను టాలీవుడ్‌కు దూరం కాలేదని, తన చదువు వల్లే కొత్త సినిమాలు అంగీకరించలేకపోయానని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో జరిగిన 'ఓం' (ఓ.ఎం: ఆపరేషన్ మోల్) చిత్ర ప్రీరిలీజ్ వేడుకలో పాల్గొన్న ఆమె, ఈ మేరకు స్పష్టతనిచ్చింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత నిబంధనల ప్రకారం రెండేళ్ల పాటు మెడికల్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి వచ్చిందని శ్రీలీల తెలిపింది. ఈ ఇంటర్న్‌షిప్ కోసం ముంబయిలోని డీవై పాటిల్ యూనివర్సిటీలో తాను ప్రత్యక్షంగా హాజరుకావడం తప్పనిసరి కావడంతో, కొత్త చిత్రాల షూటింగ్‌లకు సమయం కేటాయించలేకపోయానని వివరించింది. ఆ సమయంలోనే తాను 'ఓం' సినిమాకు మాత్రమే సంతకం చేశానని పేర్కొంది. మెడిసిన్ తప్ప తెలుగు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉండటానికి మరే ఇతర కారణాలు లేవని తేల్చిచెప్పింది. ఇదే సమయంలో తన కెరీర్, సినిమాల ఎంపికపై కూడా శ్రీలీల మాట్లాడింది. "చాలా చిన్న వయసులో నటిగా ప్రయాణాన్ని మొదలుపెట్టాను. కెరీర్ తొలిరోజుల్లో సినిమాల ఎంపిక విషయంలో నాకు పెద్దగా స్వేచ్ఛ ఉండేది కాదు. వచ్చిన అవకాశాలను అంగీకరిస్తూ ముందుకు వెళ్లాను. కొన్ని సినిమాల తర్వాత తప్పులు ఎక్కడ జరుగుతున్నాయో అర్థమైంది. ఇప్పుడు సినిమాల ఎంపికలో పరిణతి వచ్చింది" అని వివరించింది. ధనుష్ కథానాయకుడిగా నటించిన 'ఓం' చిత్రం నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో శ్రీలీల చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. మెడికల్ బాధ్యతలు పూర్తి కావడంతో ఆమె త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులతో తెలుగు తెరపై సందడి చేయనుంది.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.